
పొట్టికథ

# అనగనగా ఓ భర్త



మంతెన సూర్యనారాయణరాజు

"శారదామణీ! శారదామణీ! ఏం చేస్తున్నావే లోపల" అంటూ కేక వేశాడు పరమేశ్వర వైనులు.

"అదేవిటండీ! ఇంత క్రితమే కదా చెప్పాను లోన వంట చేస్తున్నానని. మీకు ఎన్నిసార్లు చెప్పినా అంతా వరగడు'పే" అంది కాస్త విసుక్కుంటూ.

"మర్యాద! మర్యాద! నేను నీభర్తను. ఎన్నిసార్లైనా అడుగుతాను. అందుకు నాకు హక్కుంది. అన్నట్టు మడికట్టుకున్నావా" "అబ్బబ్బ! ఒకటే నస బాబూ మీది. రోజు చెప్పాలేవిటి? మడి కట్టుకోకుండా ఒక వేళ ఉడకేసి పారేస్తే మీరు తినే పెద్దమనిషి ఏవన్నానా? అన్నట్టు చెప్పడం మరిచాను. ముందా పైపు కట్టేస్తారు, నీళ్ళు గోళంనిండా నింపేరండి" అంది శారద...

తెలుగు పంతుళ్ళకు రానురాను చాదస్తం తగ్గిపోతున్నా పండిట్ పరమేశ్వర వైనులకు మాత్రం పొరపాటున కూడా అది తగ్గలేదు. బిందె ఒకటికి రెండుసార్లు కడిగి దాన్ని నింపి లోనికి తీసుకొచ్చి యథా స్థానంలో పెట్టాడు. శారద ఉత్తరం వ్రాసుకుంటూంది. వైనులు ఆమె దగ్గరున్న స్టూలు మీద కూర్చుంటూ "ఎవరికే ఉత్తరం?" అంటూ ఆరా తీసాడు భార్యను.

"మా బావ భీమశంకరానికి"

"ఏమని వ్రాస్తున్నావు?"

"పిల్లలూ వాళ్ళు బావున్నారా! ఏలుంటే ఒక్కసారి చూసి పొమ్మని వ్రాస్తున్నాను" అంది శారదా మణి.

"భీమశంకరం అంటే ఆ మెల్లకన్నువాడా? అన్నాడు అనుమానంగా వైనులు.

"కాదు. వాడు గౌరీశంకరం. ఇతడు పెద్దాడు లెండి"

మీకూ వాళ్ళకీ బంధుత్వం ఏవిటవ్వాను" అంటూ అడిగాడు." అబ్బబ్బ! ఉత్తరం వ్రాసుకోనిస్తారా! వాళ్ళు స్వయంగా నామేనత్తకొడుకులు అన్నీ మీకనుమానాలే" అంటూ అక్కణ్ణుంచి లేచి వక్కాపోయింది.

వైనులు భోజనం చేసి స్కూలు కెళ్లిపోయాడు. సాయంకాలం తిరిగి ఇంటికొచ్చేప్పటికి ఇంటినిండా బంధుకోటి నిండిపోయింది. కుళాయి దగ్గరకెళ్ళి కాళ్ళు కడుక్కుని లోనికొస్తూ వాళ్ళని చూసి విస్తుపోయాడు. శారద అందరికీ చక్కగా వేడివేడి పూరీలు, బంగాళా దుంప కూర్మాతో టిఫిన్ పెట్టింది. మసాలా వాసన తగిలి ముక్కెగరేసాడు. ముఖం చిట్లించాడు. అందరికీ కాఫీలూ యిచ్చింది. భర్త గదిలోకెళ్ళి "రండి... మీరు కూడా వేడివేడి పూరీలు తిందురుగాని" అంటూ ఎంతో ఆప్యాయంగా పిలిచింది. "నాపిండా కూడు . వారానికి సరిపడానూ గోవిందా! పైగా వెల్లుల్లి ఉల్లీ తగ్గించమంటే తగ్గించవు. అయినా నిన్నని ఏం లాభం నాగ్రహస్థితి బాగులేక నిన్ను కట్టుకున్నానే" అన్నాడు ముఖం మాడ్చుకుంటూ.

"అయ్యయ్యో నెమ్మదిగా మాట్లాడండి. వాళ్ళు వింటే నవ్విపోతారండీ! వాళ్ళు గతిలేక మీయింటికి తిని పోవడానికి రాలేదు రండి" అంటూ లోనికెళ్ళి టిఫిన్ తెచ్చి భర్తకిచ్చింది.

ఫలహారం ఆరగించి కాఫీ సేవించి బైటికొచ్చి అందర్నీ అయిష్టంగానే పలకరించాడు వైనులు. ఒక పెద్దాయన "వైనులు! పెళ్ళై పదేళ్ళు దాటింది. మీ శారద కడుపునొక్క నలుసైనా పడలేదేమయ్యా" అన్నాడు కలుపుగోరుగా. "బావగారూ! నన్ను దత్తత చేసుకుని కన్యాదానం చేసి కన్యాదాన ఫలితం దక్కించుకోండి" అంది వరసకు మరదలైన పెళ్ళికాని అమ్మాయి.

వైనులు బెల్లంకొట్టిన రాయిలా ఉలకలేదు పలకలేదు. గుటకలు మింగాడు. వీళ్ళమొహం మండిపోను. ఎప్పుడు పోతార్రా వీళ్ళు నాయిల్లు గుల్ల చేస్తేగాని పోయేటట్టులేరని వాళ్ళని మనస్సులో తిట్టుకున్నాడు. రాత్రి తొమ్మిదిన్నర గంటల వరకూ చుట్టాలంతా చేపుకు తినడమేకాకుండా శారదను తమతో తీసుకెళ్తాం అంటూ పట్టు బట్టుక్కూర్చున్నారు. వైనులు వీళ్ళు తినేళ్ళిన దానికి వెల్లు చేసుకోవడానికి రమ్మనుంటారనుకుని, అన్నీ కలిసొస్తాయని, భార్యతాలూకు పప్పులు, ఉప్పులు నిలవుంటాయని సరేనని ఒప్పుకున్నాడు.

రెండు రోజుల్లో తిరిగొస్తుందేమోననుకున్నదల్లా రెండు వారాల దాకా శారద ఇంటికి రాలేదు. వైనులు కి అసహనం పెరిగి పోయింది. పది హేనోరోజున భీమ శంకరం ఉత్తరం వ్రాసాడు.. శారద ఇక్కడి కొచ్చాకా జ్వరం పడింది. రెండు రోజుల్లో బయల్దేరి వచ్చేస్తుందని. వైనుల మనస్సు పరిపరి విధాల పరిగెట్టింది. తన కళ్ళముందే శారదను భీమశంకరం ఒక ప్రక్క, గౌరీ శంకరం మరో ప్రక్కా లాగుతూ నాకూరమ్మంటే నాకూడా రమ్మని లాగుతున్నట్టు పగటి రాత్రి కలలు కన్నాడు.

రానురాను అతని మనస్సు కీడును శంకించ సాగింది. శంకాసంకులిత మానసుడైన వైనులుభార్య శారద తిరిగి గుమ్మంలో అడుగుపెట్టగానే ఆగ్రహోదగ్రుడయ్యాడు. మళ్ళీతనను తాను సంబాళించుకున్నాడు. గౌరీశంకరం సెకండరీ గ్రేడు ట్రైనింగు పాసయ్యాడు. ఉద్యోగం రాలేదు. భర్తతో ఏ కాన్వెంటులోనైనా ఉద్యోగం వేయించండని బతిమాలింది. పైపైకి అలాగేనని భార్యముందు గౌరీశంకరం ముందు తలాడించినా అమ్మో! వీడికి ఈ ఊళ్ళో కాన్వేంటులో ఉద్యోగం వేయిస్తే నాసంసారం తడి చేస్తాడు అనుకుంటూ, పైకి" అబ్బే! చాలాకష్టం ఈ రోజుల్లో ఉద్యోగం రావడం వాటిల్లోకూడా " అన్నాడు.

అతనిమనస్తత్వం తెలిసిన గౌరీశంకరం శారదతో చెప్పి స్వంత ఊరికి ప్రయాణమయ్యాడు. వైనుల కడుపు మంట కాస్తచల్లారినట్లైంది. ఊర్నుండి వచ్చిన ప్పట్నుంచీ శారద ఎంతో కులాసాగా తిరుగుతోంది. వైనులుకి భార్యపై ఏదో తీరని అనుమానం ఏర్పడింది. దానికి తగినట్టు ఒకరోజు స్కూలు నుంచి తిరిగొచ్చే టప్పటికి శారద వాంతి చేసుకుంటూ కనిపించింది. వైనులుకి కోపం తారాస్థాయికెళ్ళింది.

''ఏమిటే ముదనష్టపు పీనుగా! నువ్వు ఊర్నుంచి వచ్చినప్పటినుండి చూస్తున్నాను. అసలు విషయం చెబ్తావా లేదా'' అంటూ గుడ్లెర్ర చేసాడు.

భర్త అనుమానాన్ని అర్థం చేసుకున్న శారదామణి కంటనీరు పెట్టుకుని కుమిలిపోతూ ''అంతా ఖర్మండి ఇటువంటి అనుమానం మనిషికిచ్చి మావాళ్ళు నా గొంతుకోశారు''అంది.''నోర్ముయ్! ఇట్టే ఎక్కువగా వాగావంటే పళ్ళు పీకేస్తాను.'' అన్నాడు పిడికిలి బిగిస్తూ. శారద అభిమానం దెబ్బతిని ''లేకపోతే ఏవిటండీ! మీరు ప్రతిదానికీ అనుమానపడటం, నలుగురు మధ్యాలతో కావలసిన వాళ్ళొచ్చారని కాస్త ఆత్మీయతగా నడుచుకోవడం తప్పా! మనస్సు విప్పి మాట్లాడటం తప్పా! ఏడుస్తూనో ముభావంగానో కనిపిస్తే వాళ్లేమనుకుంటారోననే ఇంగితం కూడా మరిచి ప్రవర్తించడం నిజంగా నాఖర్మండీ'' అంది ఆడుపులిలా కోపంతో ఊగిపోతూ.

ఆమె టెంపర్ మెంటు చూసి వైనులు ఇంకా రెచ్చగొట్టడం యిష్టంలేక కాస్త తగ్గాడు. భార్యతో మాటలు తగ్గించేడు రెండురోజులు ఓపికపట్టింది శారద. ఇక సహనాన్ని కోల్పోయి పుట్టింటికి పోతానని రగడ ప్రారంభించింది. బట్టలు సర్దేసుకుంది. వైనులు గాభరా పడిపోతూ భార్యతో

''ఎక్కడికే ఆసర్దుళ్ళా'' అంటూ అడిగాడు.

''చెప్పానుగా. నాపుట్టింటికని'' అంది.

''ఎందుకు?'' అని అడిగాడు వైనులు.

''ఏమీ తెలియనట్టు అడుగుతారే! మీతో వేగలేక. మీ అనుమానాలబాధ పడలేక'' అంది ఏడేస్తూ. ''అంత పవిత్రురాలవే అయితే నీ పాతివ్రత్యాన్ని నిరూపించు కుంటావా'' అన్నాడు తానో ధర్మాధికారిలా.

''ఆ'' అంటూ ముక్కెగరేసింది శారద.

''అయితే ఉండు'' అని లోపలికెళ్ళి వైనులు స్టౌ వెలిగించి దానిమీద మూకుడుపెట్టి సీసాలో వున్న నూనె అందులో వంపాడు. బాగా మరగనిచ్చి ఒక పాత్ర లో పోసుకొచ్చి భార్యతో ''ఏం పరీక్షకు సిద్ధంగా వున్నావా! అయితే దోసిలిపట్టు'' అంటూ అదీయిదీ అని చెప్పకుండా ఆ సలసల మరిగినమానె, పట్టిన ఆమె దోసిట్లో పోసాడు.

శారద ఆ బాధకు తట్టుకోలేక గావుకేకలు పెట్టింది. చేతులు రెండూ బొబ్బలెక్కిపోయాయి. ఏడుపుకు ఆపులేదు. చుట్టుపక్కల వాళ్ళు వచ్చి ముక్కుమీద వేలేసుకుని ''వైనులూ నీకు బుద్ధుందా! ఇది కలియుగం. బంగారంలాంటి భార్య శీలాన్ని శంకించిందిచాలక నీ బ్రతుక్కు ఆమెశీలాన్ని బుజువు చేసుకోవడానికి పరీక్ష ఒకటా, మంత్రాలకు చింతకాయలు రాల్తాయనుకున్నావా?'' అంటూ ఒక్కొక్కరూ ఒక్కమాట కాదు. కొట్టినంత పని చేసారు.

భార్య ఆరోగ్యపరిస్థితి క్షీణించింది. ఈ అఘాయిత్యం జరిగిందని తెలిసిన తల్లిదండ్రులు, మేనమామలూ మిగిలిన బంధుకోటి అంతా వచ్చేసారు. వైనులు మావగారు అల్లుడిపై కేసు పెట్టడానికిసంసిద్ధుడైపోయాడు. వైనులుకొలీగ్స్ విషయం బయట పొక్కనివ్వకుండా వుండటానికి శతవిధాల ప్రయత్నించారు. అల్లుడి చేత మావగారికి భార్యయైన శారదకు క్షమాపణలు చెప్పించారు.

అందరూ గడ్డిపెట్టడంతో వైనులు గత్యంతరం లేక పోలీసులకు పట్టానికి భయపడి కుక్కిన పేనులా నోర్మూసుకుని జనవాక్యం కర్తవ్య మనుకుని అలాగే పాటించక తప్పలేదు. శారద అతని భార్య కాకా తప్పలేదు. కాలిన చేతులలో కొంతకాలం దాకా వంట చేయలేక పోతే తానే వండి శారదకు తినిపించడమూ తప్పలేదు. ప్రజల్లో మాత్రం వైనులుపేరు పిచ్చివైనులు గా మారిపోయింది. స్కూల్లో పిల్లలకూ ఆవిషయం తెలిసి పిచ్చివైనులుగా శాశ్వతత్వం పొందింది. ఇటువంటి భర్తలెందరో చరిత్రలో వున్నా వైనులుచరిత్ర మాత్రం ఆచంద్రతారార్కంగా ఆ ఊళ్లో శాశ్వతమై పోయింది. కట్టుకథలుగా ఎందరి నోళ్ళలోనో నానసాగింది


మీకు సంతానం కావాలా?



ఆపరేషను, ఇతర వైద్య చికిత్సలతో
నిరాశ చెందిన సోదర సోదరీమణులు
అనేకులు మా సలహాలచే సంతాన
వంతులయి ఇచ్చిన యోగ్యతాపత్రాలు కలవు.

TVS ARTS

వివరాలు ఉచితం! పోస్టుద్వారా చికిత్స కలదు!
ఈ మాసములో స్వయంగా సంప్రదించుటకు

| తెనాలి | విజయవాడ |
| --- | --- |
| ఆదివారం, గురువారం ఉ॥ గం॥ 12·00 నుండి సా॥ గం॥ 5·00 వరకు | ఉ॥ గం॥ 12·00 నుండి సా॥ గం॥ 5·00 వరకు |

శ్రీ నాగార్జున మూలికా కుటీరం
రైల్వేస్టేషన్ వద్ద.. రామాలయంవీధి.. తెనాలి - 522 202
1వ లైను.. కేదారేశ్వరపేట.. విజయవాడ - 520 003






Sicker mosquitoes mean healthier humans.
TORTOISE®
MOSQUITO COIL
Manufacturers
Bombay Chemicals Pvt. Ltd.
Fort Bombay 400 023 Phone: 273831